క్లుప్తంగా

బోరు పనులు ప్రారంభం

గుంటూరు రూరల్: శివారు గ్రామాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెంలో రూ.9లక్షలతో ఏర్పాటు చేయనున్న తాగునీటి బోర్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల, మున్సిపాల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి



ప్రత్తిపాడు: కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రతి ఒక్కరూ పాటించాలని 104 వైద్యాధికారి డాక్టర్ మేఘన అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్వాతంత్ర్య అమృత మహోత్సవంలో భాగంగా 'కుటుంబ శ్రేయస్సు కోసం మనమంతా కలిసి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి' అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ మేరకు గ్రామస్తులకు కుటుంబ నియంత్రణపై విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొరత లేకుండా పాఠ్యపుస్తకాలు



ప్రత్తిపాడు: ఎలాంటి కొరత లేకుండా ప్రభుత్వం విద్యార్థులకు రెండు సెమిస్టర్‌ల పాఠ్య పుస్తకాలను సరఫరా చేసిందని మండల విద్యాశాఖాధికారి సీహెచ్.రమాదేవి తెలిపారు. రెండవ సెమిస్టర్ పుస్తకాలు సోమవారం రాత్రి మండలానికి చేరడంతో.. స్థానిక బీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పుస్తకాల స్టాక్‌ను మంగళవారం ఎంఈవో రమాదేవి పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ మండలంలోని 8 జెడ్పీ, ఒక యూపీ, 36 ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 3,533 మంది విద్యార్థులు ఒకటి నుంచి పదవ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. వీరికి గాను మొదటి సెమిస్టర్‌కు 31,120 పాఠ్యపుస్తకాలు, 8,268 వర్క్‌బుక్స్, రెండవ సెమిస్టర్‌కు 9,090 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. సెకండ్ సెమ్ పుస్తకాలను వెంటనే పాఠశాలలకు అందజేస్తామని చెప్పారు.

సొసైటీలో రైతులకు రూ.40కోట్ల రుణాలు



వేజండ్ల(చేబ్రోలు): ఖరీఫ్ సీజన్‌లో వేజండ్ల వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు అధ్యక్షుడు చందు సాంబశివరావు అన్నారు. సొసైటీ కార్యాలయంలో మంగళవారం రైతు అవగాహన సదస్సు జరిగింది. అన్ని గ్రామాలకు చెందిన రైతులు, కౌలు రైతులు, మహిళలు హజరయ్యారు. సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు మాట్లాడారు. ఈ సీజన్‌లో రూ.40 కోట్ల వివిధ రకాల రుణాలు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించటానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. దీర్ఘకాలిక, ఎల్టీ, క్రాప్ లోన్లుతో పాటు బంగారు ఆభరణాలపై రుణాలు అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేబ్రోలు జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఎస్కే జానీ మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని తక్కువ వడ్డీకి రుణాలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో బాషా, డైరెక్టర్ ముత్యేశ్వరరావు పాల్గొన్నారు.

సింగిల్ నంబరు లాటరీ కేసులో ఇద్దరి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై అరండల్‌పేట కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. డొంకరోడ్డులో సింగిల్ నంబరు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం దాడి చేశారు. మల్లిబోయిన శ్రీను, ఊటుకూరి ఏసుబాబులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీలు

పట్నంబజారు: పట్టణంలో మంగళవారం రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు. మొత్తం 15 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గుంటూరులోని జేకేసీ కాలేజీ రోడ్డు, చుట్టుగుంట, గుజ్జనగుండ్ల తదితర ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగాయి.

నిస్వార్థ సేవకు..రాజకీయ కళంకం

- కరోనా సమయంలో వలంటీర్ల విస్తృత సేవలు
- బాధితులను గుర్తించి, చికిత్సకు తరలించేవరకు..
- కుటుంబ సభ్యులు పట్టించుకోకపోయినా.. అన్ని తామై..
- ప్రాణభయం లెక్కచేయకుండా నిస్వార్థ సేవ..
- రాజకీయ లబ్ధి కోసం.. జనసేన అధినేత తీవ్ర ఆరోపణలు
- భగ్గుమన్న వలంటీర్లు, పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మలు దహనం



ప్రత్తిపాడు పాతమద్రాసు రోడ్డులో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

ప్రత్తిపాడు: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పవన్ నోరు అదుపులో పెట్టుకోవాలని లేదంటే.. తమ చెప్పులకు పని చెప్పాలా.. అంటూ మండిపడ్డారు. ఏలూరు బహిరంగ సభలో నిస్వార్థ సేవ చేస్తున్న వలంటీర్లపై రాజకీయ లబ్ధి కోసం ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వలంటీర్లు ప్రత్తిపాడులో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ కాంస్య విగ్రహం ఎదుట గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. 'డౌన్ డౌన్ పవన్‌కల్యాణ్.. నోటిని అదుపులో పెట్టుకుంటావా పవన్.. చెప్పుల దెబ్బలు తింటావా పవన్.. వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలి..' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని నేరుగా ఢీకొట్టే ధైర్యం లేక వలంటీర్లను, మహిళలను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారంటూ పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మకు చీరె కట్టి, చెప్పులతో చితకబాదారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేసి, కాళ్లతో తన్నారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పవన్‌కు మతిభ్రమించిందన్నారు. ఏం మాట్లాడుతున్నాడో కూడా అర్థం కాని దౌర్భాగ్య స్థితిలో పవన్ ఉన్నాడని మండిపడ్డారు.

వలంటీర్లకు పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

పెదకాకాని: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా ఉండి విధులు నిర్వహిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి డిమాండ చేశారు. పెదకాకానిలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. కోవిడ్ సమయంలో కరోనా బారిన పడిన వారిని గుర్తించడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించారన్నారు. కరోనా బాధితులకు కూరగాయలు, మందులు అందజేసి ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం అందించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో పింఛను కోసంవృద్ధులు, వికలాంగులు పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడేలా వేధిస్తే... వలంటీర్లు ప్రతి నెలా 1న తెల్లవారు జామునే.. ఇంటింటికీ వెళ్లి పింఛనుదారులకు నగదు అందజేస్తున్నారన్నారు. ఒంటరి మహిళలను, యువతులను గుర్తించి హ్యూమన్ ట్రాఫికింగ్‌కు వలంటీర్లు సహాయపడుతున్నారని పవన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.



ప్రత్తిపాడులో కరోనా సమయంలో మహిళకు చిక్కీలు, కోడిగుడ్లు అందజేస్తున్న వలంటీరు(ఫైల్)

వలంటీరు ఇచ్చిన మనోధైర్యం మాటల్లో చెప్పలేనిది



ప్రత్తిపాడు గ్రామంలో మొట్టమొదటిగా నేను కరోనా బారిన పడ్డాను. ఈ విషయం ఊరంతా చర్చనీయాంశమైంది. నా తల్లిదండ్రులతో పాటు సోదరుడు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. చుట్టుపక్కల వాళ్లు కూడా భయంగానే గడిపారు. ఈ సమయంలో నాతో పాటు, నా కుటుంబ సభ్యులకు మా వలంటీర్ టి.అనూష్ ఇచ్చిన మనోధైర్యం మాటల్లో చెప్పలేనిది. మహిళ అయినా.. 108కు కాల్ చేసి చికిత్స నిమిత్తం నన్ను గుంటూరుకు తీసుకెళ్లడం మొదలు, నా కుటుంబ సభ్యులను కూడా క్వారంటైన్ సెంటరుకు పంపడంలో వలంటీరు పాత్ర అనిర్వచనీయం. అప్పటి వరకూ ఇంట్లో వాళ్లకి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వలంటీరే కూరగాయలు, సరుకులు ఇంటికి తీసుకువెళ్లి ఇచ్చారు.

– బాపతు గోవింద్ రెడ్డి, ప్రత్తిపాడు

కరోన సమయంలోనూ పింఛను ఆపలేదు



కరోనా సమయంలో కోవిడ్ మహమ్మారి బారిన పడ్డాను. ఇంట్లో భార్య, ఇద్దరు పిల్లలు. సంతానంలో ఒకరు ప్రత్యేక అవసరాలు గల చిన్నారి. మంచానికే పరిమితమైన ఆ చిన్నారికి ప్రభుత్వం పింఛను అందిస్తుంది. కరోనా సమయంలో మహమ్మారి బారిన పడిన వారి ఇళ్లకు వెళ్లాలంటేనే ప్రతి ఒక్కరూ గజగజ వణికిపోయిన పరిస్థితి. కానీ ఆ సమయంలో మా ఇంటికి వచ్చి.. పింఛను ఇచ్చింది మా వలంటీరు వై.మహాలక్ష్మి. కరోనా తీవ్ర రూపం దాల్చిన సమయంలోనూ పింఛన్లు పంపిణీ చేశారు.

– షేక్ బాజీ, ప్రత్తిపాడు

కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు



గతంలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే అనేకసార్లు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థతో ఆ బాధలు ప్రజలకు తప్పాయి. వాళ్లే నివాసాల వద్దకు వచ్చి ప్రతి పథకానికి కావాల్సిన అర్హత పత్రాలు తీసుకెళ్లి.. దరఖాస్తు చేస్తున్నారు. అలానే మా అబ్బాయికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వచ్చింది.

– పి. శాంతకుమారి, ప్రత్తిపాడు

ఆలయాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ తోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శివశంకరరావు

పెదకాకాని: ఆలయాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందని శివాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అన్నారు. ఉప్పలపాడులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు మాట్లాడుతూ నూతనంగా శివాలయం ధర్మకర్తల మండలి ఏర్పాటు కావడాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ బురదజల్లే ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం దేవాలయ చైర్మన్ నియామకంలో రాజకీయాలు చేయడం వారి చేతగాని తనానికి నిదర్శనమన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు గజ్జల వెంకాయమ్మ, తోట రవీంద్ర, గంగవరపు మల్లేశ్వరరావు, గుమ్మళ్ళ వెంకట్రావు, కారంకి శివనాగేశ్వరమ్మ, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, తోటకూర వెంకటేశ్వరరావు, కరణం సాంబశివరావు, కానుగోలు శంకరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్, ముద్రవరపు నాగేశ్వరరావు, మైలా సుబ్బారావు, చెన్నుపాటి కళ్యాణ్, పల్లెంపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుమ్మలపాలెం ఎంపీయూపీ పాఠశాల తనిఖీ

తుమ్మలపాలెం (ప్రత్తిపాడు): తుమ్మలపాలెం ఎంపీయూపీ పాఠశాలను మంగళవారం ఎంఈవో-2 జి.లీలారాణి సందర్శించారు. పాఠశాల రిజిస్టర్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ, ఉపాధ్యాయుల సంఖ్య తక్కువ ఉందని పేరెంట్స్ కమిటీ సభ్యులు లీలారాణి దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని సభ్యులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలించారు.

సంక్షేమంతో సురక్షిత పాలన అందిస్తున్న జగనన్న

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- అడవితక్కెళ్ళపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం



సర్టిఫికెట్ అందజేస్తున్న మేయర్ కావటి మనోహర్‌నాయుడు



సర్టిఫికెట్ అందజేస్తున్న చైర్మన్ లాలుపురం రాము, జెడ్పీటీసీ తుమ్మల



ధృవీకరణ పత్రం అందజేస్తున్న తహసీల్దారు సిద్దార్థ, ఎంపీడీవో శ్రీరమ్య



ఉప్పలపాడులో ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ గోళ్ళ జ్యోతి



స్థల దాక్యుమెంటు అందజేస్తున్న ప్రత్యేకాధికారి పల్లవి, తహసీల్దారు గోపాలకృష్ణ

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రజలకు సంక్షేమంతో పాటు సురక్షితమైన పాలనను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని గుంటూరు నగర కార్పొరేషన్ మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం 41వ డివిజన్ అడవితక్కెళ్ళపాడులో స్థానిక కార్పొరేటర్ బి.స్మితపద్మజ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేయర్ కావటి మాట్లాడుతూ మనబడి నాడు – నేడు ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్ వైద్య రంగంలో ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత కల్పించారన్నారు. స్వర్ణభారతి నగర్, అడవితక్కెళ్ళపాడు, రెడ్డిపాలెం సచివాలయాల పరిధిలోని అర్జీలు పెట్టుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ, వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముత్యాల రాజు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

తుమ్మలపాలెం (ప్రత్తిపాడు): 'తాగునీరు రంగుమారి వస్తున్నాయి. తాగాలంటేనే భయంగా ఉంది. సైడు కాలువల్లో పూడిక తీసి నెలలయ్యింది. మలేరియా, డెంగీ రోగాలొస్తున్నాయంటున్నారు.. మేమేం చేయాలంటూ తుమ్మలపాలెం గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. తుమ్మలపాలెంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శ్రీరమ్య, తహసీల్దార్ సిద్దార్థ్, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ధృవీకరణ పత్రాలను అర్జీదారులకు అందించారు. గ్రామాభివృద్ధికి, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ పథకాల వివరాలను శాఖల వారీగా వివరించారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామంలోనికి సరఫరా అవుతున్న మంచినీటిని వాటర్ బాటిళ్లలో నింపి, వాటిని క్యాంపు వద్దకు తుమ్మలపాలెం గ్రామస్తులు తీసుకువచ్చారు. మేం తాగలేకపోతున్నాం.. వాటర్ ప్లాంట్ దగ్గర నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోందని వాపోయారు. నెలల తరబడి కాలువల్లో సిల్టు తియ్యకపోవడంతో మొక్కలు మొలుస్తున్నాయని చెప్పారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్ రక్షిత మంచినీటి చెరువులోని నీరు అడుగంటడం వల్లే సమస్య మొదలయ్యిందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతమ్మ, ఎంపీటీసీ మేరుగ సుభాషిణి, ఏపీఎం సురేష్, ఏవో అరుణకుమారి, హెచ్‌వో బేబి, ఈవోపీఆర్డీ మోషె తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

పెదనందిపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజగోపాల్ అన్నారు. మంగళవారం వరగాని, పాలపర్రు గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. వరగాని గ్రామంలో 1,171 మంది, పాలపర్రులో 365 మంది అర్జీదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభాని, ఏఓ సుధారాణి, ఎంఈవో డి.బాలసుబ్రమణ్యం, ఈవోపీఆర్డీ సాయిలీల, సర్పంచ్‌లు మేరిమ్మ, సునీత సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) తెలిపారు. మంగళవారం లాలుపురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందాలని నవరత్నాల పథకాలను ప్రజల ఇంటి ముంగిటకు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనన్నారు. ఏ సమస్య వచ్చినా అధికారుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే అన్ని శాఖల అధికారులను ఏర్పాటు చేసి క్షణాల్లో సమస్యల పరిష్కారం చూపుతున్నారన్నారు. అర్జీదారులకు సర్టిఫికెట్లు, కౌలు రైతు కార్డులు, సబ్సిడీ విత్తనాలు అందజేశారు. రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీడీవో శోభరాణి, డిప్యూటీ తహసీల్దారు బిట్టు రమేష్, జేసీఎస్ మండల కన్వీనర్ ఎదురుపాక వెంకట్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, ఏవో ఐ.సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం(

పెదకాకని: అర్హత కలిగిన వారందరికీ లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష శిబిరాల లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి అన్నారు. మండలంలోని నంబూరు, ఉప్పలపాడు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. తహసీల్దారు పి.రత్నం 255 మంది అర్జీదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, ఉప్పలపాడు సొసైటీ ప్రెసిడెంట్ దయానంద బాబు, కరణం శంకరరావు, చెన్నుపాటి శివకుమారి, ఏడుకొండలు, ముద్రబోయిన నాగేశ్వరావు, పల్లెంపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, దంతాల శ్రీనివాసరావు, చెన్నుపాటి కల్యాణ్ పాల్గొన్నారు. నంబూరు అంబేడ్కర్ నగర్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఎంపీడీవో నాగమల్లేశ్వరరావు, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, ఎస్కే సుభాని, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపుకోటిరెడ్డి పాల్గొన్నారు.

98 మందికి స్థల డాక్యుమెంట్లు పంపిణీ

శ్రీరంగపురం(చేబ్రోలు): ప్రభుత్వం పేదలందరికి సంక్షేమ పథకాలను అందిస్తోందని మండల ప్రత్యేకాధికారి పల్లవి అన్నారు. శ్రీరంగపురం గ్రామ సచివాలయం, చేబ్రోలు-5 సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్షా శిబిరం జరిగింది. శ్రీరంగపురంలో జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేశారు. స్థానిక తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ ప్రత్యేక చొరవతో శ్రీరంగంపురం గ్రామానికి చెందిన 98మందికి ఇళ్ల పట్టాలు అందజేయటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కౌలు కార్డులు త్వరితగతిన అందించాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: కౌలు రైతులను గుర్తించి, వెంటనే కౌలు కార్డులను అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం పొత్తూరు గ్రామంలో పత్తి, ఆకుకూరలు తదితర పంటలను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట వివరాలను నమోదు చేసి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులను త్వరితగతిన రైతులకు అందించాలని చెప్పారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పంటల సాగు విస్తీర్ణం, పంట వివరాలు తెలుసుకున్నారు. యాజమాన్య పద్ధతులు వివరించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.సుబ్రమణ్యం, పొత్తూరు వీఆర్‌వో రవి, వీఏఏ వైష్ణవి పాల్గొన్నారు.

కోటి ఆశలతో.. హలధారి



హలం పట్టి పొలం దున్నుతున్న రైతన్న



కోటి ఆశలతో పత్తి విత్తనాలను నాటుతున్న మహిళలు

హలం పట్టి.. పొలం దున్ని, విత్తు విత్తి.. కలుపు తీసి.. దిగుబడులు వచ్చే వరకు హాలికుడు పడే పాట్లు అన్నీ ఇన్నీ కాదు. తొలకరి పలకరించిన తరువాత కర్షకులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. సేద్యాన్ని మొదలుపెట్టారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూములు పదునెక్కడంతో హలధారి పొలంలో కోటి ఆశలతో ప్రత్తిపాడులోని పొలాల్లో పత్తి విత్తనాలను విత్తుతున్నాడు. ఆ చిత్రాలే ఇవి.

–ప్రత్తిపాడు